క్లుప్తంగా

మాజీ మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ పుస్కూరి నర్సింగరావు సతీమణి భారతి గుండెపోటుతో మరణించారు. కాగా గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం మహిపాల్‌రెడ్డి, ఐత వెంకటస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ శోభా శంకర్

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్ సూచించారు. పట్టణంలోని పూసాలలో గురువారం వార్డులను పరిశీలించి వార్డు ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. దోమల నివారణకు వార్డుల్లో ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న అల్ఫోర్స్ హైస్కూల్‌లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికలు, యశోద వేషధారణలతో సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో నాటికలు ప్రదర్శించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు

జూలపల్లి: దేశం కోసం, ధర్మం కోసం బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసే పనిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ సెప్టెంబరు 5 నుంచి ప్రతీ బూత్‌లో 200 సభ్యత్వానికి తగ్గకుండా నమోదు చేయాలని బూత్ స్థాయి అధ్యక్షులకు సూచించారు. నాయకులు పోల్సాని సంపత్‌రావు, తంగెడ రాజేశ్వర్‌రావు, ఎర్రోళ్ల శ్రీకాంత్, మెండె రాజయ్య, ఐలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

కష్టజీవుల బతుకులు ఆగం

గోదావరిఖని: కష్టజీవుల బతుకులను రామగుండం ఎమ్మెల్యే ఆగం చేస్తున్నారని ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కక్షపూరిత రాజకీయాలు చేస్తూ కార్పొరేషన్ పరిధిలో సుమారు 250కుపైగా ఫ్లెక్సీ బోర్డులను అకారణంగా తీసివేయించి 200 మంది ఉపాధి దెబ్బతీశారన్నారు. ఎమ్మెల్యే తీరుతో వారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్ పంపిణీ

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో గురువారం గ్రామ వాస్తవ్యులు సౌమిత్రి తిరుమలాచార్యులు వారి తండ్రి, సోదరుల జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ.15వేల విలువ చేసే నోట్‌బుక్స్, పెన్నులు, క్రీడా సామగ్రి అందజేశారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచం పట్టిన పల్లెలు

- ఇంటింటా జ్వర పీడితులే
- గ్రామాలపై చికున్‌గున్యా పంజా
- జ్వరాలు, కీళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి
- ఐదురోజులైనా తగ్గని వైనం



జూలపల్లిలో జ్వరంతో మంచం పట్టిన బాధితుడు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చికున్‌గున్యా పంజా విసురుతోంది. ఇంట్లో ఒకరికి వచ్చిందంటే మిగతా వాళ్లకందరికీ జ్వరం వస్తోంది. కీళ్ల నొప్పులతో మంచం పట్టి, లేవలేని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రతీ ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారు. అధికారులు ప్రతీవారం పారిశుధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించినా వైరల్ ఫీవర్స్, చికున్ గున్యా మాత్రం ఆగడం లేదు.

సర్కారు దవాఖానలో క్యూ..

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీరోజు జ్వర పీడితులతో క్యూలైన్ ఉంటోంది. రోజూ 60 నుంచి 70 మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నారు. ఇందులో సగం వరకు డెంగీ, చికున్‌గున్యా లక్షణాలు ఉంటున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ ఏది?

గ్రామాల్లో చికున్‌గున్యా, డెంగీ జ్వరాలు పంజా విసిరినా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు కానరావడం లేదు. నెల క్రితం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు తప్ప ప్రత్యేక వైద్య శిబిరాలు మాత్రం నిర్వహించలేదు. దీంతో జ్వరపీడితులు కరీంనగర్‌లోని ప్రైవేటు హాస్పిటళ్లకు క్యూ కడుతున్నారు. ప్రతీ రోగికి పరీక్షలతో పాటు మందులకు రూ.20వేల వరకు ఖర్చవుతోందని చికిత్సకు వెళ్లి వచ్చిన వారు చెప్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

గ్రామాల్లో ఫీవర్స్‌పై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సర్వే చేస్తున్నం. పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తాం. డ్రై డే, దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధుల నుంచి కాపాడుకునే విధానాలపై అవగాహన కల్పించినం.
– సంపత్‌రెడ్డి, మండల వైద్యాధికారి, జూలపల్లి



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీనాగుల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి సీసీరోడ్డు ఆనుకొని ఉన్న గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. నెలరోజుల కిందట భగీరథ మంచి నీటి వాటర్ పైప్‌లైన్ లీక్ కావడంతో గుంత తీసి పైపులైన్‌కు మరమ్మతు చేశారు. కానీ గుంతను పూడ్చడం మరిచారు. ఆలయానికి వెళ్లే దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి సమయాల్లో అటు వైపు వెళ్లే వాహనదారులు గుంతలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా రామగుండం మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించి గుంత పూడ్చాలని వాహనదారులతో పాటు న్యూమారేడుపాక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- జమీల్, ఏఈ, సెల్ : 94910 54912

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 97053 46608

మొక్కలు నాటి కాపాడాలి



మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి



మొక్క నాటుతున్న ఎంపీడీవో శైలజారాణి

పెద్దపల్లిరూరల్: పచ్చదనం పెంచేందుకు ప్రతీఒక్కరు మొక్క నాటి కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల బీసీ హాస్టల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులు తమ వంతుగా మొక్కలు నాటడంతో పాటు కుటుంబీకులతో కలిసి నాటించాలని సూచించారు. కౌన్సిలర్ రెవెల్లి స్వామి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, అనిల్‌కుమార్, లక్ష్మీనర్సయ్య, నర్సరీ ఇన్‌చార్జి సదానందం పాల్గొన్నారు.

అమ్మపేరిట మొక్కలు నాటడానికి శ్రీకారం

రామగిరి: పర్యావరణ పరిరక్షణకు అధికారులు అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని పన్నూర్, రత్నాపూర్ గ్రామాల్లో 'నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద' అంటూ ఎంపీడీవో శైలజారాణి గురువారం మొక్క నాటారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఎంపీవో ఉమేశ్, ఈసీ లక్ష్మణ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రంజిత, టీఏలు అఖిల, కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

జీఎంలకు సన్మానం



సన్మానిస్తున్న ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం ఎన్.రాధాకృష్ణ

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కొప్పుల వెంకటేశ్వర్లు, ఎన్.రాధాకృష్ణ అన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య, కార్పొరేట్ కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ సెల్ జీఎం గుండా మోహన్‌రెడ్డి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా గురువారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, ప్రాజెక్టు అధికారులు సీ.హెచ్.వెంకటరమణ, ఎన్.రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ జీఎంగా పనిచేస్తున్న జి.మోహన్‌రెడ్డి ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ గురువారం జీఎం మోహన్‌రెడ్డిని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజ నిర్వహిస్తున్న సంజీవ నంబూద్రి గురుస్వామి

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయం ఆవరణలో గల శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ సంజీవ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో మూడురోజులుగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా చివరిరోజు దేవాలయానికి, ధ్వజస్తంభానికి అభిషేకం నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, గోనె విశ్వనాథం, భీమనపల్లి పృథ్వీరాజ్, పాత రవీందర్, శ్రీరామోజీ తిరుమలాచారి, కొమురయ్య, వెంకటేశ్, రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

రామగిరి: అవయవదానానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని, ఉగ్గె కొమురమ్మ, కూర సతీశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు సానా రామకృష్ణారెడ్డి, గంట వెంకటరమణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని రాజాపూర్‌లో గురువారం ఉగ్గె కొమురక్క, కల్వచర్లలో కూర సతీశ్ సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులను సన్మానించి అభినందన పత్రాలు అందజేశారు. ఓదెలు, శ్రీనివాస్, నాగరాజు, శంకర్, సతీశ్, బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

పెద్దపల్లిరూరల్: జాతీయ అంతరిక్ష దినోత్సవం ఆగస్టు 23న నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆ చారిత్రక ఘట్టాన్ని మరోమారు తిలకించేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మాధవి ఆదేశించారు. చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్, ప్రముఖ శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వివరాలకు సైన్స్ అధికారి 9951504622 నంబరును సంప్రదించాలని డీఈవో సూచించారు.

● పోలింగ్ కేంద్రాల వివరాలు సేకరించాలి

రామగుండం: రామగుండం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాలు, బూత్‌ల వారీగా పూర్తి స్థాయి వివరాలు సేకరించాలని అంతర్గాం ఎంపీడీవో ఎం.ఎ.అలీం ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు, ఓటింగ్ సామగ్రి ఇతర అంశాలపై గురువారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీవో వేణు, మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్ పాల్గొన్నారు.

● పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

కమాన్‌పూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఎంపీడీవో లలిత సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం జూలపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీవో భాస్కర్ ఉన్నారు.

● దళిత మహిళా కార్మికురాలిపై దాడిని ఖండిస్తున్నాం

యైటింక్లయిన్‌కాలనీ: ఓ దళిత మహిళ కార్మికురాలిపై ఈనెల 15న సింగరేణిలోని ఓ యూనియన్ నాయకుడు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం, సీఐటీయూ దాని అనుబంధ సంఘాలు దళిత పేద ప్రజల కోసం శ్రామిక కార్మికవర్గం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నాయని పేర్కొన్నారు. దళిత సంఘాలు విడివిడిగా కాకుండా అన్నీ కలిసి ఐక్యంగా ఏర్పడి న్యాయం జరిగేదాకా పోరాటం చేయాలని కోరారు.

● మత్తుకు బానిస కావొద్దు

పెద్దపల్లిరూరల్: యువత మత్తుకు బానిసగా మారి బంగారు భవిష్యత్ పాడు చేసుకోవద్దని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్ నియంత్రణపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపిందని, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

● పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

ఎలిగేడు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పీఆర్టీయూతోనే పరిష్కారమవుతాయని పీఆర్టీయూ–టీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రు సరేశ్, గండు కృష్ణమూర్తి అన్నారు. మండలంలో గురువారం ప్రోగ్రెసివ్ రికగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

● వేధింపులకు గురిచేస్తే సమాచారం ఇవ్వండి

ధర్మారం: మహిళల రక్షణకు షీటీం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని వేధింపులకు గురిచేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని షీటీం సభ్యురాలు స్నేహలత కోరారు. రామగుండం అడ్మిన్ డీసీపీ రాజు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో గురువారం మహిళల భద్రతపై షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. స్నేహలత మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 63039 23700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, బెదిరింపులకు గురిచేస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

● కరాటే విద్యార్థికి సన్మానం

మంథని: హర్యానాలోని పంచకుల ఒలంపిక్ భవన్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెట్టు సహాసిని ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి బంగారు పతకం సాధించారు. పట్టణంలోని మర్రివాడలో కరాటే శిక్షకుడు కావేటి సమ్మయ్య నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికారి కిషన్ సన్మానించారు.

● ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి: మండలంలోని కల్వచర్ల పురాతన ఆలయమైన సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. విగ్రహాల దాత బూసాల కమల–సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లు చేశారు.

● కస్తూర్బా పాఠశాల తనిఖీ

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలను గురువారం ఎంపీడీవో శైలజారాణి తనిఖీ చేపట్టారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని వంట గది, డైనింగ్ హాల్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో కుక్ సిబ్బంది, స్కావెంజర్లను నియమించాలని ప్రత్యేకాధికారి మంజు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. మండల వైద్యాధికారి ప్రదీప్, హెల్త్ సూపర్‌వైజర్ సీతారామయ్య తదితరులు ఉన్నారు.

● కస్తూర్బా విద్యాలయం సందర్శన

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ శివారులో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంతో పాటు జయ్యారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం ఎంపీడీవో శశికళతో పాటు ఎంపీవో సుదర్శన్, మండల వైద్యాధికారి డాక్టర్ సూర్య సందర్శించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. అదేవిధంగా కుక్కలగూడుర్‌లోని సంపదవనాన్ని పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి సుదర్శన్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవదాసు, ఉపాధిహామీ మండల ఏపీఎం కొమురయ్య ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



సుల్తానాబాద్: రాస్తారోకో చేస్తున్న నాయకులు



మంథని: ధర్నాలో పుట్ట మధు



కాల్వశ్రీరాంపూర్‌లో రాస్తారోకో..

సుల్తానాబాద్: బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ రోడ్డుకు వెళ్లి రహదారిపై తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెల్లిందని విమర్శించారు. రాస్తారోకో నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకొని విరమింపజేశారు. మాజీ ఎంపీపీ బాలాజీరావు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, దీకొండ భూమేశ్, శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దయాకర్, గందె మల్లికార్జున్, కౌన్సిలర్ గోపి, బాపూరావు, కుమారస్వామి, శేఖర్, రఫీక్, రాజు ఉన్నారు. ఎస్సై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

వందశాతం రుణమాఫీ చేయాలి

మంథని: వందశాతం రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కార్, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు డిమాండ్ చేశారు. మంథని ప్రధాన చౌరస్తాలో గురువారం ధర్నా నిర్వహించారు. రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు పూటకో మాట చెప్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. కాల్వశ్రీరాంపూర్ ఏఎస్సై నీలిమ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న రైతులను శాంతింపజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు కొట్టె రవి, నరేందర్, నిదానపురం దేవయ్య, కొల్లూరి రాయమల్లు, మార్, చందు, కరుణాకర్, సారంగపాణి, రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరిట మోసం చేసిందని ఆరోపిస్తూ గురువారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. మాజీ సర్పంచ్ కొండయ్య, నాయకులు బాపయ్య, న్యాతరి పోచాలు, తిరుపతిరెడ్డి, సత్యం, కనుకయ్య, అనిల్, రాజేశం, రవి, బాసంపల్లి వినోద్, చంద్రయ్య, మల్లేశం పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం



మొక్కలు అందజేస్తున్న కరస్పాండెంట్ సురేందర్

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని ప్రగతి టెక్నో స్కూల్‌లో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్, ప్రిన్సిపాల్ కావ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన అమరగాని గంగాధర్ పోలీస్ వృత్తిలో అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఆగస్టు 15న మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జూలపల్లిలో ఆయనను సన్మానించారు. మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం, పీసీ సాంబరెడ్డి, మానుమండ్ల శ్రీనివాస్, శ్రీనివాస్, సతీశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కపైసా రాలేదు



మాట్లాడుతున్న మేయర్ బంగి అనిల్‌కుమార్

కోల్‌సిటీ: బీఆర్‌ఎస్ హయాంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒక్కపైసా రాలేదని మేయర్ బంగి అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. గోదావరిఖని ప్రధాన వ్యాపార కూడళ్లలో రూ.29.5 కోట్లతో చేపట్టే పనులకు బుధవారం శంకుస్థాపన చేయగా, టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.100 కోట్లు తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసిన నేపథ్యంలో మేయర్ స్పందించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవ తీసుకొని నగరాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా రూ.100కోట్లతోపాటు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ విడుదలయ్యాయని తెలిపారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు పోస్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించే జాతీయ మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.